

ఊరంతా నీళ్లే : కిర్లంపూడి మండలంలో నీట మునిగిన రాజుపాలెం



ఉగ్ర గోదారి : కొవ్వూరు గోష్పాదక్షేత్రం వద్ద వరద ఉధృతి

రెండో ప్రమాద హెచ్చరిక దిశగా వరద దిగువకు 11.27,715 క్యూసెక్కులు విడుదల

తగ్గినట్టే తగ్గి.. పెరిగిన గోదారి

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి)/కొవ్వూరు : గోదావరి వరద పోటె త్తింది. ఎగువ రాష్ట్రాల్లో కురిసిన భారీ వర్షాల వల్ల గోదావరి మహోగ్రరూపం దాల్చింది.కేవలం కొన్ని గంటల వ్యవధిలోనే ప్రమాదస్థాయికి చేరుకుంది. గోదావరి తీర ప్రాంత ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. రెండు రోజుల కిందట వరద తగ్గిందని ఊపిరిపీల్చుకునే లోపే గోదావరికి మరలా వరద పోటెత్తింది. గోదావరి ఎగువ ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు, ఉపనదులు పొంగి పొర్లుతున్నాయి. నదిలో వరద నీరు అధికంగా వచ్చి చేరడంతో వరద తగ్గినట్టే తగ్గి ఒక్కసారిగా ఉధృతంగా పెరిగింది. రాజమహేంద్రవరం, కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో సోమవారం రాత్రికి వరద నుంచి పూర్తిగా బయటపడిన స్నానఘట్టాలు 24 గంటల్లో మరలా వరద ప్రవాహం ముంచెత్తింది. మంగళవారం రాత్రి 7 గంటలకు ధవళేశ్వరం బ్యారేజీ నీటిమట్టం 11.75 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్టు గోదావరి రివర్ కన్జర్వేటర్, హెడ్‌వర్క్స్ ఈఈ కె.కాశీ శ్వేశ్వరరావు ప్రకటించారు. భద్రాచలం వద్ద నీటిమట్టం 48 అడుగులు దాటడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రాత్రి 11 గంటలకు ఇక్కడ నీటి మట్టం 49.80 అడుగులుగా ఉంది.ఇది మరింత పెరిగే అవ కాశం ఉంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద రాత్రి 11 గంటలకు నీటిమట్టం 12.80 అడుగులకు చేరడంతో 11,27,715 క్యూసె క్కుల వరదను 175 గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు.అది అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని లంకలను ముం చెత్తుతూ సముద్రంలోకి పోతోంది. గోదావరి పాండ్ లెవల్ 14.25 మీటర్లకు పెరి గింది. కాలువలకు 3 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. బుధవా రం నాటికి రెండో ప్రమాద హెచ్చరిక కూడా జారీ చేసే అవకాశం ఉందని వరద నీరు 12 లక్షల నుంచి 13 లక్షల క్యూసెక్కుల చేరే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చెప్పారు. గోదావరి ఎగువ ప్రాంతాలైన భద్రాచలం, మధ్య ప్రదేశ్, చత్తీస్‌గడ్ ప్రాంతాల్లో అధిక వర్షాలు కురుస్తుండడంతో గోదావరికి భారీ వరద వస్తుందని తెలిపారు. రాజమహేంద్రవరంలోని కలె క్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి మంగళ వారం ఆమె క్షేత్రస్థాయి సమన్వయాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. 24 గంటల్లో రెండో ప్రమాద హెచ్చరిక జారీ కావొచ్చన్నారు. ముంపు, లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తర లించి తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. రాజ మహేంద్రవరం,కొవ్వూరు డివిజన్లలో అత్య వసర పనులకు కార్యాచరణ సిద్ధం చేసి వెం టనే పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.రెండు డివిజన్లలో 6 పనులకు ఇరిగేషన్ అధికారులు నివేదిక ఇచ్చారు. రాజమహేంద్రవరం, సీతానగరం, నిడద వోలు, నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం తదితర మండలాల్లో ముంపు ఎక్కు వగా ఉంటుందని,అక్కడి లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిం చాలని జేసీ ఎస్.చిన రాముడు ఆదేశించారు. పలు ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు.

జల వలయం



వరదలో హై..వే : గొల్లప్రోలులో టోల్‌గేట్ వద్ద జాతీయ రహదారిపై ఉధృతంగా వెళుతున్న వరద నీళ్లు

- కాకినాడ జిల్లాలో ఏలేరు..కన్నీళ్లు
- 7 మండలాల్లో 62 గ్రామాలు మునక
- ఎక్కడికక్కడ కాలవలకు గండ్లు
- ఐదు మండలాల ప్రధానదారులు మూత
- నీట మునిగిన 45 వేల ఎకరాలు
- ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృతి
- రెండో ప్రమాద హెచ్చరిక దిశగా వరద
- కోనసీమలో లంకలు మునక
- పలు గ్రామాలకు రాకపోకలు బంద్

ముంచిన ఏలేరు.. ఉప్పొంగుతున్న గోదారి



దారేది : పి.గన్నవరం మండలంలో కనకాయలంక కాజ్‌వేపై వరద

కోనసీమలో భయంభయం

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

గోదావరి వరద ఉగ్ర రూపం దాల్చడంతో బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని లంక గ్రామాల ప్రజలు భయం గుప్పెట్లో జీవిస్తున్నారు. గోదావరి వరద ఉధృతి కారణంగా కోనసీమలోని గౌతమి, వృద్ధగౌతమి, వశిష్ట, వైనతేయ నదీపాయల్లో ప్రవాహ వేగం పెరుగుతోంది. ఇప్పటికే ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. బ్యారేజీ నుంచి మంగళవారం రాత్రి 7 గంటలకు 10 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయడంతో నదీపాయలన్నీ పొంగి పొర్లుతున్నాయి. ఉభయ గోదావరి జిల్లాల సరిహద్దు ప్రాంతమైన చాకలిపాలెం కనకాయలంక కాజ్‌వే జలదిగ్బంధానికి గురైంది. సమీపంలోని లంక ప్రాంతాలను వరద ప్రవాహం ముంచెత్తుతోంది. నదీపాయలను ఆనుకుని ఉన్న కాజ్‌వేలు ముంపు బారిన పడడంతో ఆయా గ్రామాలకు రవాణా సౌకర్యాలు నిలిచిపోయాయి. వరద పెరుగుతున్నందున కొన్నిచోట్ల విద్యుత్ సౌకర్యానికి అంతరాయం కలుగుతోంది. బలహీనంగా ఉన్న ఏటిగట్ల వద్ద నిఘా పెట్టి పర్యవేక్షిస్తున్నారు. కుండలేశ్వరం సమీపంలో కుంగిన గట్టు వద్ద గడ్డర్లు ఏర్పాటుచేసి వాహనాలు వెళ్లకుండా అధికారులు నిరోధించారు. సముద్రపు మొగల వద్ద అలల ఉధృతి తీవ్రంగా ఉంది. ప్రధానమైన రేవుల్లో పరిస్థితిని బట్టి పంట్లు, పడవలపై రాకపోకలు సాగించాలని, వరద పెరిగితే తక్షణం నిలుపుదల చేయాల్సిందిగా ఇప్పటికే అధికారులు ఆదేశాలిచ్చారు. జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ అటు ప్రజలను, ఇటు జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ముందు జాగ్రత్తగా రెండు ఎన్డీఆర్‌ఎఫ్ బృందాలను కోనసీమ జిల్లాకు కేటాయించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం 17 పాయింట్లలో జరుగుతున్న ప్రయాణికుల రాకపోకలపై ఆంక్షలు విధించారు. పడవలపై ప్రయాణం చేయాలనుకునే వారికోసం లైఫ్ జాకెట్లు, గత ఈతగాళ్లను సిద్ధం చేశారు. మొదటి ప్రమాద హెచ్చరిక జారీ సమయంలో జి.పెదపూడి వద్ద పునరావాస కేంద్రాన్ని ఏర్పాటుచేయగా రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తే 44 ప్రాంతాల్లో పునరావాసాల్లో ఏర్పాటు చేయనున్నారు. మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ ఆలయానికి వెళ్లే కాజ్‌వే వద్ద పరిస్థితిని కలెక్టర్ పరిశీలించారు. మరోవైపు గోదావరి నదీ పరివాహక లంక గ్రామాల్లోని విద్యా సంస్థలకు బుధవారం సెలవు ప్రకటిస్తున్నట్టు కలెక్టర్ వెల్లడించారు. రాగల 72 గంటల పాటు అధికార యంత్రాంగం అప్రమత్తతతో పనిచేయాలని, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ రూములు ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఎటుచూసినా వరద.. ఊళ్లన్నీ ఏరులై.. చేలన్నీ చెరువులై.. ఉదయం కనిపించిన రోడ్లు, ఇళ్లు మధ్యాహ్నానికి వరదలో మాయమయ్యేంత జల ప్రళయం.. జిల్లాలో ఏలేరు వరద మంగళవారం భయోత్పాతం సృష్టించింది. అంచనాలకు అందని జలవిలయంతో ముంచెత్తింది. దీంతో జిల్లాలో ఏడు మండలాల్లో 62 గ్రామాలు వరదలో చిక్కుకుని విలవిల్లాడాయి. 45 వేల ఎకరాలకు పైగా పంట పొలాలు నిండా మునిగాయి. మంగళవారం తెల్లవారుజాము నుంచీ ఏలేరు వరద మరింత పోటెత్తడంతో పిఠాపురం, గొల్ల ప్రోలు, ఏలేశ్వరం, కిర్లంపూడి, పెద్దాపురం, ప్రత్తిపాడు, కొత్తపల్లి, సామర్లకోట మండలాల్లో వరద ముంపు భారీగా పెరిగింది. అనేక ప్రధాన రహదారులపై నీళ్లు పొంగుతూ ప్రవహించడంతో ఎక్కడికక్కడ రాకపోకలు నిలిచిపోయాయి. పిఠాపురంలోని రాపర్తి నుంచి గొల్లప్రోలు టోల్‌గేట్ మధ్యలో 216 జాతీయ రహదారిపై వరద నీరు చొచ్చుకొచ్చేసింది. దీంతో ఒకవైపు ప్రయాణాలు నిలిపివేశారు. దీనివల్ల భారీగా ట్రాఫిక్‌జామ్ అయింది. ఏలేరు నుంచి దిగువకు 42 వేల క్యుసెక్కులకుపైగా నీరు విడుదల చేయడంతో వరద కాలువల్లో పొటెత్తి ఎక్కడికక్కడ గండ్లు పడి తీవ్ర నష్టంవాటిల్లింది. ప్రత్తిపాడు,కిర్లంపూడి, పెద్దాపురం, సామర్లకోట, పిఠాపురం మండలాల ప్రధాన రహదారులపై వరద నీరు ప్రవహిస్తుండ డంతో తాత్కాలికంగా మూసివేశారు. ముంపు గ్రామాలు విద్యుత్ లేక అంధకారంలో ఉన్నాయి.వరద ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలకోసం ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు రంగం దిగాయి.

8 మండలాల్లో వరద ప్రభావం

- గొల్లప్రోలు మండలంలో ఏలేరు వరద నష్టం తీవ్రంగా ఉంది.ఏలేరు కాలువకు ఆరు చోట్ల గండ్లు పడ డంతో 8,500 ఎకరాల్లో పంటలు,10 గ్రామాలు నీటముని గాయి. గొల్లప్రోలు-తాటిపర్తి,చెందుర్తి-తాటిపర్తి రోడ్లు మూసివేశారు. వరద ఉధృతికి పిఠాపురం నుంచి గొల్లప్రోలు వెళ్లే దారిలో రాపర్తి నుంచి టోల్‌గేట్ వరకు వరద జాతీయ రహదారిపైకి వచ్చేసింది.ఈ దారిలో రాత్రి 8 గంటల నుంచి రాకపోకలు పూర్తిగా నిలిపియడంతో భారీగా ట్రాఫిక్ నిలిచింది. గొల్లప్రోలు,పిఠాపురం శివారు ప్రాంతాల్లో అనేక కాలనీలను వరద ముంచడంతో బాధితులు ఆకలితో అలమటించారు.
- పిఠాపురం మండలంలో ఏలేరు కాలువకు 9 చోట్ల గండ్లు పడడంతో 14 వేల ఎకరాల్లో పంటలు నీట మునిగా యి. వరదనీరు ప్రధాన రహదారులపైకి వచ్చేయడంతో గొల్లప్రోలు-బి.ప్రత్తిపాడు,పిఠాపురం-రాపర్తి, పిఠాపురం- నరసింగపురం- జములపల్లి,పిఠాపురం-గోకివాడ మధ్య రాకపోక లు నిలిచిపోయాయి. 15 గ్రామాలు వరదలో చిక్కుకున్నాయి.
- కిర్లంపూడి మండలంలో ఏలేరు కాలువకు మొత్తం పది చోట్ల గండ్లు పడడంతో 16 వేల ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. మొత్తం 21 గ్రామాల్లో వరద చేరింది. రాజుపాలెంలో వందలాది కుటుంబాలు నరక యాతన పడుతున్నాయి.రాజుపాలెం-ముక్కోలు, గెద్దనాపల్లి- భూపాలపట్నం,భూపాలపట్నం-ఎస్.తిమ్మాపురం- బూరుగుపూడి, సోమరాయణపేట, పాలెం వరకు రాకపోకలు నిలిపివేశారు.
- ప్రత్తిపాడు మండలంలో ఏలేరు కాలువకు గండి పడడంతో 1,200 ఎకరాలు నీట మునిగింది.వరదలకు పెద్దిపాలెం, వేము లపాలెం,ధర్మవరం, వెల్లుర్తి రహదారులు మునిగాయి. సుబ్బారెడ్డిసాగర్ కాలువలకు గతంలో పడ్డ గండ్లు తాజా వరద లతో మరింత ఎక్కువయ్యాయి.
- ఏలేశ్వరం మండలంలో 2,800 ఎకరాలు నీటమునిగాయి. ఎర్రవరం,తిరుమాలి ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లారు.
- పెద్దాపురం మండలంలో ఏలేరుకు ఒక చోట గండిపడి 4,300 ఎకరాలు నీటమునిగాయి.మర్లావ వరదలో చిక్కుకుంది.పెద్దాపురం నుంచి కాండ్రకోట రాకపోకలు నిలిపేశారు.
- సామర్లకోట మండలంలో ఏలేరు వరద కారణంగా పంట పొలాలు నీటమునిగాయి. టిడ్కో గృహాల వద్ద భారీగా వరద నీరు చేరింది. ఉప్పువారి సత్రం నుంచి జల్లూరు వరకూ 8 కి.మీ మేర వరదనీరు చేరింది. సామ ర్లకోట-పిఠాపురం మధ్య ద్విచక్ర వాహనాల రాకపోకలు నిలిపివేశారు.
- కొత్తపల్లి మండలంలో 800 ఎకరాల్లో పంట నీట మునిగింది.

ఏలేశ్వరంలో..



ఏలేశ్వరం-అప్పనపాలెం వంతెన పూర్తిగా నీట మునిగిన దృశ్యం

కిర్లంపూడిలో..



కిర్లంపూడి మండలం రాజుపాలెంలో ఏలేరు కాలువ వరదకు నీటమునిగిన పొలాలు

ప్రత్తిపాడులో..



ప్రత్తిపాడు మండలం ధర్మవరం-వెల్దుర్తి వంతెనపై ప్రమాదకరంగా ప్రవహిస్తున్న సుద్దగడ్డ

పిఠాపురంలో..



పిఠాపురం-గొల్లప్రోలు మధ్య పంట పొలాలను, ఇళ్లను ముంచెత్తుతున్న ఏలేరు వరద

గొల్లప్రోలులో..





సామర్లకోట-పిఠాపురం రోడ్డులో మోకాలి ఎత్తున చేరిన ఏలేరు వరద నీరు



పెద్దాపురంలో వరద సహాయక చర్యలకు వచ్చిన ఎన్‌డీఆర్‌ఎఫ్ బృంద సభ్యులు

ఉప్పెనలా ఏలేరు వరద

గొల్లప్రోలు/పిఠాపురం, సెప్టెంబరు 10: ఏలేరు వరద ఉప్పెన మాదిరిగా వచ్చింది. పొలాలు, కాలనీలు, ఇళ్లను ముంచేసింది. ఆపై సుద్దగడ్డ వరద ఉధృతి తోడైంది. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాల్లోని రహదారులు, పొలాలు, పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లోని గ్రామాలు వరద ముంపునకు గురయ్యాయి. అతిభారీగా ఏలేరు వరద నీరు రావడంతో ముంపు తీవ్రత గణనీయంగా పెరిగింది. కాలనీలకు బోటులోనే రాకపోకలు సాగుతున్నాయి. ఏలేరు రిజర్వాయర్‌నుంచి అతిభారీగా మిగులు జలాలు విడుదల చేయడంతో పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతోపాటు రెండు మండలాల పరిధిలోని గ్రామాలను వరద నీరు ముంచెత్తింది. సోమవారంతో పోల్చుకుంటే మంగళవారం సాయంత్రానికి వరద ఉధృతి రెండు రెట్లకు పైగా పెరిగింది. దీనికి సుద్దగడ్డ వరద ఉధృతి తోడవ్వడంతో ముంపు మరింత అధికమైంది. గొల్లప్రోలు బైపాస్‌రోడ్డు నుంచి పట్టణంలోకి వెళ్లే ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారిపై కిలోమీటరు మేర నాలుగుచోట్ల వరద నీరు ప్రవహిస్తుండగా పిఠాపురం పట్టణంలోకి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుపైనా నీరు ప్రవహిస్తోంది. పిఠాపురంలోకి వెళ్లే రోడ్డులో వరద ఉధృతికి రెండు మోటార్‌సైకిళ్లు కొట్టుకుపోయాయి. దీంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిపివేశారు. అగ్రహారం మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. గొల్లప్రోలు పట్టణంలోకి పిఠాపురం వైపు నుంచి వచ్చే రోడ్డులోను వాహనాల రాకపోకలను నిలిపివేశారు. గొల్లప్రోలు, పిఠాపురం పట్టణ శివారులోని ఏలేరు కాలువలకు పిడిందొడ్డి, బాడవకాలువ, పులిదొడ్డి, ఎదురొడ్డి, ఇల్లింద్రాడ తదితర ప్రాంతాల్లోను, భోగాపురం, రాపర్తి గ్రామాల వద్ద గొర్రిఖండి కాలువతోపాటు ఏలేరు నీరు ప్రవహించే పంట కాలువలకు 15చోట్లపైగా గండ్లు పడ్డాయి. దీంతో ఈ నీరు పంటపొలాలు మీదుగా ప్రవహిస్తోంది. ఏలేరు, సుద్దగడ్డ వరద నీటితో పిఠాపురం పట్టణం, రూరల్‌లోను, గొల్లప్రోలు పట్టణం, రూరల్‌లోను 20వేల ఎకరాల్లో పంటలు ముంపునకు గురయ్యాయి.

పెద్దాపురం-కాండ్రకోట రహదారిపై రాకపోకలు నిలిపివేత

పెద్దాపురం, సెప్టెంబరు 10: ఏలేరు ఉధృతంగా ప్రవహించడంతో పెద్దాపురం నుంచి కాండ్రకోట గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అటువైపు ఎవరూ వెళ్లకుండా ఉండేలా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో గుడివాడ, సిరివాడ గ్రామాలకు వెళ్లేవారు చుట్టుతిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరద సహాయక చర్యలను ముమ్మరం చేసేందుకు నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డీఆర్‌ఎఫ్) 40మందితో కూడిన బృందం రంగంలోకి దిగింది. దబ్బకాలువ రెగ్యులేటర్ వద్ద నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న వృక్షాలను తొలగించేందుకు బృందం చర్యలు చేపట్టింది.

పిఠాపురం- ప్రత్తిపాడు మధ్య రహదారి బంద్

- ఆపై సుద్దగడ్డ వరద ఉధృతి
- గొల్లప్రోలులో పొలాలు, ఇళ్లను ముంచేసిన వరద
- 15చోట్లకు పైగా గండ్లు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 10: భారీ వర్షాలకు ప్రత్తిపాడు-పిఠాపురం నియోజకవర్గాల గ్రామాలను కలిపే ధర్మవరం-వెల్దుర్తి రహదారి మంగళవారం కూడా మూతపడింది. సుద్దగడ్డ వాగు ఉధృతి కొనసాగడంతో అధికారులు ఈ రహదారిని రెండోరోజు కూడా మూసివేశారు. వంతెన అవతల వైపున పిఠాపురం పోలీసులు, వంతెన ఇవతల వైపున ప్రత్తిపాడు పోలీసులు ముళ్లకంచెలు, స్టాపర్‌లను వేసి రహదారిని బంద్ చేశారు. 20 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సామర్లకోట-పిఠాపురం రోడ్డులో రాకపోకలు నిలిపివేత

సామర్లకోట, సెప్టెంబరు 10: ఏలేరు జలాలు విడుదల కారణంగా సామర్లకోట పట్టణాన్ని వరద ముంచెత్తడంతో సామర్లకోట శివారు ఉప్పు వారి సత్రం నుంచి జల్లూరు వరకూ 8కిలోమీటర్ల పొడవునా మోకాలు ఎత్తున వరదనీరు చేరింది. ఉన్నతాధికారుల హెచ్చరికల మేరకు సామర్లకోట-పిఠాపురం మధ్య ద్విచక్ర వాహనాల రాకపోకలను సామర్లకోట పోలీసులు నిరోధించారు. ఈ మేరకు ప్రత్యేక పోలీసు పికెట్‌ను ఉప్పువారి సత్రం వద్ద ఏర్పాటు చేశారు.

4 మండలాల పాఠశాలలకు.. నేడు సెలవు

కాకినాడ రూరల్, సెప్టెంబరు 10: కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని నాలుగు మండలాల్లోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు బుధవారం సెలవు ప్రకటించినట్లు డీఈవో పి.రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏలేరు వరద నీటి ఉధృతి పెరుగుతుండడంతో పిఠాపురం, యు.కొత్తపల్లి, గొల్లప్రోలు, కిర్లంపూడి మండలాల్లోని పాఠశాలలకు సెలవు ప్రకటించామన్నారు. సెలవును తప్పనిసరిగా పాటించాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పునరావాస కేంద్రాల్లో.. 3116 మంది

- ముంపు గ్రామాల్లో 6513మంది


కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 10: వరద నేపథ్యంలోజిల్లాలో 3116మంది బాధితులకు పునరావాస కేంద్రాల్లో ఆవాసం కల్పించారు. ప్రభుత్వం వీరికి ఆహారం సరఫరా చేస్తోంది. మరో 6513మంది ముంపు గ్రామాల్లో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. వీరిని పునరావాస కేంద్రాలకు తరలించే ప్రయత్నం చేస్తున్నారు. జిల్లాలో పిఠాపురం, గొల్లప్రోలు, కిర్లంపూడి, పెద్దాపురం, సామర్లకోట, తుని, ఏలేశ్వరం మండలాల్లో 33 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు.

వరద సహాయక చర్యలు పకడ్బందీగా చేపట్టాలి

- రైతులకు భరోసా కల్పించండి
- జిల్లా అధికారులతో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

పిఠాపురం, సెప్టెంబరు 10: ఏలేరు వరద ముంపు ప్రభావితమైన 21 మండలాల్లోని 152 గ్రామాల్లో సహాయక చర్యలను పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. వరద ఉధృతిపై జిల్లా కలెక్టరు షాన్‌మోహన్, ఇతర అధికారులతో మంగళవారం ఆయన మాట్లాడారు. గొల్లప్రోలు పరిసర ప్రాంతాల్లో ముంపు, వరదలో చిక్కుకున్న రాజుపాలెం, కోలంక, సోమవరం, ఎస్.తిమ్మాపురం, వీరవరం, కృష్ణవరం, రామకృష్ణాపురం గ్రామాల్లో పరిస్థితిపై ఆరా తీశారు. మాధవపురం, నవఖండ్రవాడ గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేయడంతోపాటు సహాయక కేంద్రాలకు తీసుకువెళ్లాలని సూచించారు. పంటలు మునిగిన రైతులకు ధైర్యాన్ని ఇచ్చి భరోసా కల్పించాలని చెప్పారు. ముంపు తగ్గిన వెంటనే నష్టాలను అంచనా వేయాలని ఆదేశించారు. పశుసంపదకు నష్టం జరగకుండా జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. సోమవారం రాత్రి నుంచి ప్రతి గంటకు ఉపముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు వరద సమాచారం సేకరిస్తూ పర్యవేక్షణ చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.

నేడు సీఎం చంద్రబాబు రాక



- కిర్లంపూడి మండలం రాజుపాలెంలో నీటమునిగిన ప్రాంతాల పరిశీలన - 7లో
- సామర్లకోట టీటీడీసీలో ఎగ్జిబిషన్ సందర్శన.. అధికారులతో సమీక్ష

216వ జాతీయ రహదారిపై ట్రాఫిక్ మళ్లింపు - 7లో

ముంపు బాధితులను రక్షించేందుకు సిద్ధం: కలెక్టర్

- 10వేల మందికి ఆహార పొట్లాలు
- 5వేల కుటుంబాలకు నిత్యావసరాలు

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 10: వరద ముంపు బాధితులను రక్షించేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. జిల్లాలో ఏడు మండలాల్లో వరద ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. దానిలో 10వేలమంది బాధితులకు ఆహారం అందిస్తున్నామన్నారు. 5వేల కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామన్నారు. బాధితులను అత్యవసర పరిస్థితులో తరలించడానికి ఎక్స్‌కవేటర్‌లు సిద్ధంగా ఉంచామన్నారు. ఏడు మండలాల్లో ప్రత్యేక అధికారులు పరిస్థితులను చక్కదిద్దుతున్నారన్నారు. బాధితులను రక్షించేందుకు ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్ డీఆర్‌ఎఫ్, ఆర్మీ బృందాలు దిగాయన్నారు. కాకినాడ రూరల్ చీడిగ, కిర్లంపూడి మండలం రాజుపాలెం, యు.కొత్తపల్లి మండలం నాగులాపల్లి, పెద్దాపురం మండలం జి.రాగంపేటల్లో గండ్లు పడకుండా చర్యలు తీసుకున్నామన్నారు. వీకే రాయపురం, రామేశ్వరం, రాజుపాలెం, నాగులాపల్లి, మాదాపురం, రమణక్కపేటల్లో గండ్లు పూడ్చి గట్లు పటిష్టం చేశామన్నారు.

చిరుతపులి జాడ కనబడలేదు!

- అటవీ ప్రాంతాన్ని ఆనుకుని హౌసింగ్ బోర్డు కాలనీ వాసుల చెత్తాచెదారం
- పందుల సంచారంతో పులికి ఆహారం
- జిల్లా ఇన్‌చార్జి డీఎఫ్‌వో భరణి

దివాన్‌చెరువు, సెప్టెంబరు 10: చిరుతపులి జాడ సోమవారం రాత్రి ఏ ట్రాప్ కెమెరాల్లో చిక్కలేదని, దాని పాదముద్రలు కూడా గుర్తించబడలేదని జిల్లా అటవీశాఖాధికారి ఎస్.భరణి తెలిపారు. చిరుతపులి వల్ల అటవీ బయట ప్రాంతాల్లో మనుషులకుగాని, పశువులకుగాని ఎటువంటి హాని జరగలేదని మంగళవారం రాత్రి విడుదల చేసిన ప్రకటనలో మీడియాకు తెలిపారు. సోమవారం ఏర్పాటుచేసిన విధంగానే మంగళవారం కూడా చిరుతపులిని పట్టుకొనేందుకు అదనంగా బోనులు ఏర్పాటు చేశామన్నారు. దివాన్‌చెరువు రిజర్వ్ అటవీ ప్రాంతాల్లో చిరుతపులి సంచారం కోసం ట్రాప్ కెమెరాలు అమరికలో మార్పులు చేశామని చెప్పారు. రిజర్వ్ అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న నివాస ప్రాంతమైన హౌసింగ్‌బోర్డు కాలనీలోని గృహాల వద్ద నుంచి చెత్తను వేసి అపరిశుభ్రంగా తయారు చేస్తున్నారన్నారు. దీనివల్ల పందులు విపరీతంగా ఉండడంతో చిరుతపులికి ఆహారం సమృద్ధిగా లభిస్తోందన్నారు. రిజర్వ్ అటవీ ప్రాంతాన్ని ఆనుకొని ఉన్న నివాస ప్రాంతాల్లోని ఇళ్ల వద్ద చెత్తను పక్కనే ఉన్న అడవిలో వేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని రఘునాథపురంలో దూడను చిరుతపులి చంపినట్టుగా వాట్సాప్ గ్రూప్‌లలో వచ్చిన సమాచారంలో వాస్తవం లేదన్నారు. ఈ దూడ కనిన్ కుటుంబం (కుక్కలు, నక్కలు)కు చెందిన జంతువు దాడివల్ల చనిపోయిందన్నారు. అసత్య ప్రచారాలు చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయవద్దని కోరారు. నకిలీ సందేశాలకు పంపినవారిపై పోలీస్‌శాఖ చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు.



గొల్లప్రోలు టోల్‌గేట్ సమీపంలో 216వ జాతీయ రహదారిపై భారీగా ప్రవహిస్తున్న ఏలేరు వరద నీరు

రహదారులన్నీ బంద్

- జాతీయరహదారిపై ఏలేరు వరద బీభత్సం
- రెండువైపులా భారీగా ప్రవహిస్తున్న ఏలేరు వరద నీరు.. రాకపోకలు నిలిపివేత

పిఠాపురం/గొల్లప్రోలు/కాకినాడ క్రైం, సెప్టెంబరు 10: జాతీయ రహదారిపై ఏలేరు వరద బీభత్సం సృష్టించింది. కాకినాడ-కత్తిపూడి మధ్య 216వ జాతీయ రహదారిని విస్తరించి పునర్నిర్మించిన తర్వాత ఏలేరు వరద రహదారిపై ఇంత భారీస్థాయిలో రావడం ఇదే ప్రథమం. సుమారు రెండున్నర కిలోమీటర్ల మేర ఆరుచోట్ల వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఏలేరు కాలువలకు పలుచోట్ల గండ్లు పడడంతోపాటు భారీగా మిగులు జలాలను విడుదల చేయడంతో 216వ జాతీయరహదారి వరద నీటిలో చిక్కుకుంది. గొల్లప్రోలు టోల్‌గేటు సమీపంలో, ఇల్లింద్రాడ రైసుమిల్లు వద్ద, పిఠాపురం బైపాస్‌రోడ్డులో రాపర్తి జంక్షన్-వై జంక్షన్ మధ్యలో జాతీయరహదారికి రెండువైపులా ఏలేరు వరద నీరు ప్రవహిస్తోంది. ఒకవైపు రెండున్నర నుంచి మూడున్నర అడుగుల ఎత్తులో వరద నీరు ప్రవహిస్తుండడంతో పిఠాపురం-కత్తిపూడి మార్గంలో తొలుత వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఎక్కడికక్కడ బారీకేడ్లు ఏర్పాటు చేసి పోలీసులను మోహరించారు. వరద ఉధృతికి ద్విచక్రవాహనదారులు, కార్లు, ఇతర చిన్నవాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గొల్లప్రోలు బైపాస్‌రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో ఒకవైపు ఏలేరు వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో పిఠాపురం బైపాస్‌రోడ్డు రాపర్తి జంక్షన్ నుంచి టోల్‌గేటు మీదుగా గొల్లప్రోలు బైపాస్‌జంక్షన్ తాటిపర్తి రోడ్డు వరకూ ఒకవైపే వాహనాలను అనుమతించారు. వరద పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణలు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కాకినాడ-కత్తిపూడి మధ్యగల 216వ జాతీయ రహదారిపై పిఠాపురం బైపాస్‌రోడ్డు, గొల్లప్రోలు టోల్‌ప్లాజా వద్ద ఏలేరు వరద నీరు భారీగా ప్రవహిస్తున్న నేపథ్యంలో మంగళవారం రాత్రి నుంచి రెండువైపుల నుంచి వాహనాల రాకపోకలను నిలిపివేశారు. ఈ మేరకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఒక ప్రకటన విడుదల చేశారు. పిఠాపురం బైపాస్, గొల్లప్రోలు టోల్‌ప్లాజా, గొల్లప్రోలు బైపాస్‌రోడ్ల మీదుగా వాహనాలను అనుమతించడం లేదని, ఇక్కడ పోలీసు పహారా ఏర్పాటుచేశామని ఆయన తెలిపారు. అచ్చంపేట జంక్షన్, వాకలపూడి లైట్‌హౌస్ జంక్షన్, కత్తిపూడిల వద్ద నుంచే వాహనాలను దారిమళ్లిస్తున్నారు. ఈ విషయాన్ని కాకినాడ డీఎస్పీ రఘువీర్ విష్ణు కూడా తెలియజేశారు. ఈ మళ్లింపును వాహనదారులు గమనించి సహకరించాలని కోరారు.


మళ్లింపు ఇలా...

- అచ్చంపేట జంక్షన్ నుంచి కత్తిపూడి వైపు వెళ్లే భారీ వాహనాలు, కార్లు, ద్విచక్ర వాహనాలను గొల్లప్రోలు టోల్‌ప్లాజా వైపు అనుమతించడం లేదు.
- వాకలపూడి, అచ్చంపేట జంక్షన్ నుంచి పిఠాపురం మీదుగా తుని, వైజాగ్ వైపు వెళ్లే వాహనాలను సామర్లకోట మీదుగా ఎన్‌హెచ్ 16 వైపు మళ్లిస్తున్నారు.
- కత్తిపూడి నుంచి కాకినాడ వైపు వెళ్లే వాహనాలు కత్తిపూడి, జగ్గంపేట, రాజానగరం, సామర్లకోట మీదుగా కాకినాడ చేరుకోవాలి.

నేడు సీఎం చంద్రబాబు రాక

పెద్దాపురం, సెప్టెంబరు10: సీఎం చంద్రబాబు బుధవారం ఏలేరు వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనున్నారు. ఏర్పాట్లను కలెక్టర్ షాన్ మోహన్ మంగళవారం రాత్రి ఆర్డీవో జె.సీతారామారావుతో కలిసి పర్యవేక్షించారు. బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు సామర్లకోట జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో దిగుతారు. రోడ్డు మార్గాన 2.40 గంటలకు కిర్లంపూడి మండలం రాజుపాలెం చేరుకుని నీటమునిగిన గ్రామాలు, పంటలను పరిశీలించి బాధితులతో మాట్లాడతారు. 3.10 గంటలకు సామర్లకోట టీటీడీసీలో ఎగ్జిబిషన్‌ను సందర్శించి అధికారులతో సమీక్షిస్తారు. అనంతరం 4.35కు విజయవాడకు బయలుదేరి వెళతారు.

గోదావరి ఉగ్రరూపం



కాటన్ బ్యారేజీ వద్ద వరద నీటి ప్రవాహం

- ధవళేశ్వరం వద్ద రాత్రి 7 గంటలకు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ
- 11 లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి.. వరద పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



బ్యారేజీ వద్ద గోదావరి ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్, జిల్లా ఎస్పీ


ధవళేశ్వరం, సెప్టెంబరు 10: భద్రాచలం వద్ద గోదావరి రెండో ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల్లో విస్తారంగా కురిసిన వర్షాలు వల్ల ఇంద్రావతి నుంచి వరదనీరు, వాయుగుండం ప్రభావంతో ఒడిశా పరిసరాల్లో కురిసిన వర్షాలు వల్ల శబరి నది ఉధృతమై గోదావరిలో కలుస్తుండడంతో ధవళేశ్వరం వద్ద గోదావరి పోటెత్తుతోంది. సోమవారం రాత్రి నుంచి పెరుగుతున్న నీటిమట్టం గంటకు ఒక్క పాయింట్ చొప్పున పెరుగుదల నమోదు చేసుకోగా మంగళవారం ఉదయం నుంచి మరింత ఉధృతమై గంటకు రెండు పాయింట్లు చొప్పున పెరిగిన నీటిమట్టం రాత్రి 7 గంటలకు 11.75 అడుగులకు చేరి 10,01,811 క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తుండడంతో రివర్ కన్జర్వేటర్ మొదటి ప్రమాద హెచ్చరికను జారీచేశారు. ఆపై పెరుగుతున్న నీటిమట్టం రాత్రి 11 గంటలకు 13 అడుగులుగా నమోదైంది. 11,55,027 క్యూసెక్కులు సముద్రంలోకి వదులుతున్నారు. నీటిమట్టం మరింత పెరిగి బుధవారం ఉదయానికి రెండో ప్రమాద హెచ్చరికస్థాయి 13.75 అడుగులకు పెరగవచ్చని అధికారులు అంచనా. ఎగువన భద్రాచలం వద్ద పెరుగుదల వేగం మందగించడంతోపాటు శబరి ఉధృతి తగ్గడంతో ధవళేశ్వరం వద్ద 15 లక్షల క్యూసెక్కుల వరకు వరద రావచ్చని అంచనా. కాగా భద్రాచలం వద్ద వేగంగా పెరుగుతున్న నీటిమట్టం మంగళవారం ఉదయం 9 గంటలకు మొదటి ప్రమాద హెచ్చరికస్థాయి దాటి ప్రవహించగా సాయంత్రం 5గంటలకు 48.20 అడుగులకు చేరడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయింది. ఆపై పెరుగుతున్న నీటిమట్టం రాత్రి 11 గంటలకు 49.80 అడుగులకు చేరుకుంది. కాగా ఎగువున కాళేశ్వరం వద్ద మంగళవారం సాయంత్రానికి నీటిమట్టం 8.60 మీటర్లుగా నమోదుకాగా, పేరూరు వద్ద 17.33 మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 13.50 మీటర్లు, భద్రాచలం వద్ద 48.60 అడుగులు, కూనవరం వద్ద 20.28 మీటర్లు, కుంట వద్ద 15.13మీటర్లు, పోలవరం వద్ద 12.52మీటర్లు, రాజమండ్రి రైల్వే బ్రిడ్జి వద్ద 15.82 మీటర్లుగా నమోదైంది. కాగా గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మంగళవారం కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ కాటన్ బ్యారేజీ పైనుంచి పరిశీలించారు. నీటిమట్టం కొలిచే సూచీలు ఉన్న ప్రాంతంలో నీటి మట్టాన్ని పరిశీలించి ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ గోదావరి వరద ఉధృతంగా ఉన్నందున లంక గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు చెప్పారు. వినాయక విగ్రహాల నిమజ్జనంలో రేవుల వద్దకు ప్రజలను అనుమతించబోమని, ఉత్సవ కమిటీకి చెందిన కొందరిని మాత్రమే అనుమతిస్తామన్నారు. వీరి వెంట ధవళేశ్వరం సీఐ గణేష్, ఇరిగేషన్ ఇంజనీర్లు నాగలక్ష్మి, ఎ.సాయిరాం తదితరులున్నారు.



ఏలేరు వరదలో చిక్కుకున్న ముగ్గురు యువకులు

సురక్షితంగా బయటకు తీసుకువచ్చిన స్థానికులు

పిఠాపురం రూరల్, సెప్టెంబరు 10: ఏలేరు వరదలో ముగ్గురు యువకులు చిక్కుకున్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం మండలం రాపర్తి గ్రామానికి చెందిన తొమ్మిది మంది యువకులు గొర్రిఖండి వద్ద వరద నీటిని చూసేందుకు వెళ్లారు. అక్కడ వరద నీటిలో దిగగా ప్రవాహానికి చిక్కుకున్నారు. ఆరుగురు యువకులు గట్టుపై నుంచి జములపల్లికి సురక్షితంగా చేరుకున్నారు. అయితే ఎస్.శివ, దుర్గాప్రసాద్, బి.శివలు మాత్రం వరదనీటిలో చిక్కుకుపోయారు. దీనితో స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. ఈలోగానే స్థానికులు వారిని సురక్షితంగా కాపాడి బయటకు తీసుకువచ్చారు. ఆర్డీవో ఇట్ల కిషోర్ ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతో చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.



సీఎం చంద్రబాబుకు రూ.50 లక్షల విరాళం అందిస్తున్న తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు

వరద బాధితులకు 'తిరుమల' రూ.50 లక్షల విరాళం

రాజమహేంద్రవరం రూరల్, సెప్టెంబరు 10: విజయవాడ వరద బాధితుల సహాయార్థం రాజమహేంద్రవరం తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు రూ.50 లక్షల విరాళం అందించారు. మంగళవారం విజయవాడలో సీఎం చంద్రబాబును కలిసి చెక్‌ను అందించారు. అలాగే బాధితులకు తిరుమల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సుమారు 25 వేల ఆహార పొట్లాలు, వాటర్ ప్యాకెట్లు పంపించామని తిరుమలరావు తెలిపారు. ఆయనను చంద్రబాబు అభినందించారు.



వరద బాధితుల కోసం డిప్యూటీ సీఎం పవన్‌కు సురుచి ఫుడ్స్ అధినేత మల్లిబాబు రూ.20 లక్షల చెక్కును అందజేస్తున్న దృశ్యం

వరద బాధితులకు 'సురుచి' రూ.20 లక్షల విరాళం

మండపేట, సెప్టెంబరు 10: విజయవాడ వరద బాధితుల కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం తాపేశ్వరం సురుచి ఫుడ్స్ అధినేత పోలిశెట్టి మల్లికార్జునరావు (మల్లిబాబు) రూ.20 లక్షల చెక్కును ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్‌కు మంగళవారం అందజేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న తమ ఏడు స్వీట్‌స్టాల్స్ ద్వారా ఆదివారం అమ్మకాల ద్వారా వచ్చిన రూ16.90 లక్షలు, సంస్థ సిబ్బంది 600 మంది ఒక రోజు వేతనం రూ.2.36 లక్షలతోపాటు తాను కొంత కలిపి మొత్తం రూ.20 లక్షల చెక్కును సీఎం సహాయనిధికి అందించినట్టు మల్లిబాబు పవన్‌కు వివరించారు. తాపేశ్వరం సురుచి చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను మల్లిబాబు పవన్‌కు వివరించారు. దీంతో పవన్ ఆయనను అభినందించారు. కేరళ తుపాను బాధితులకు అందించిన సాయం గురించి మల్లిబాబు వివరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను మల్లిబాబు సత్కరించి, ఐదు కిలోల లడ్డూను పవన్‌కు బహూకరించారు. ఆయన వెంట సురుచి పీఆర్వో వర్మ ఉన్నారు.

కోరుకొండ ఆలయం ఆదాయంలో అన్నవరం దేవస్థానం ఉద్యోగుల గోల్‌మాల్

- రూ.15 లక్షల వరకు ఖజానాకు కన్నంపెట్టినట్టు ఆరోపణలు
- ఈవో సీరియస్

అన్నవరం, సెప్టెంబరు 10: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో ఒక విభాగంలో పని చేస్తున్న పలువురు ఉద్యోగులు సుమారు రూ.15 లక్షలు గోల్‌మాల్ చేసినట్టు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అన్నవరం దత్తత దేవాలయం అయిన కోరుకొండ లక్ష్మీనరసింహ ఆలయంలో ఏడాది కాలంలో వివిధ పద్దుల కింద సుమారు 15 లక్షలు ఆదాయం రాగా అక్కడ ఆదాయం ఇక్కడ చూపించకుండా ఖర్చులు మాత్రమే అన్నవరం దేవస్థానం నుంచి చూపించారు. అక్కడ ఆదాయం చూపకుండా ఖర్చులు మాత్రమే చూపుతుండడం దీనిపై పంపకాలలో తేడా రావడంతో విషయం బయటపడింది. ఈవో రామచంద్రమోహన్ ఈ అంశంపై సిబ్బందిపై ఫైర్ అయ్యారు. తక్షణమే పూర్తి నివేదికను అందజేయాలని అధికారులను ఆదేశించారు. లేకుండా సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని హెచ్చరించినట్టు చెబుతున్నారు. కోరుకొండ ఆలయ ఆదాయవ్యయాలను లీజుల విభాగ అధికారులు చూస్తుండడం పంపకాలలో తేడా రావడంతో విషయం బయటకి పొక్కింది. కోరుకొండ ఆలయం దత్తత తీసుకుని 10 ఏళ్లు అవుతుండగా ఏడాదిలో ఇంత గోల్‌మాల్ జరగగా గతంలో జరిగిన లావాదేవీలపై విచారణ జరిపితే మరింత పెరుగుతుందని అంటున్నారు.

సత్యదేవుడి విమానగోపురం బంగారు తాపడానికి మరోసారి అంచనాలు

అన్నవరం, సెప్టెంబరు 10: రత్నగిరివాసుడైన సత్యదేవుడి విమానగోపురానికి బంగారుతాపడం చేయించాలనే ప్రతిపాదనకు దేవదాయ కమిషనర్ ఆదేశాలతో టీటీడీ రూ.99 కోట్లు వ్యయం అవుతుందని అంచనావేయగా, దీన్ని మరోసారి అంచనా వేయించాలని దేవస్థానం అధికారులు కోరారు. గతంలో ఒకసారి దేవదాయశాఖ స్థపతి అంచనా సుమారు 12 కోట్లు వేయగా టీటీడీ జ్యూయలరీ విభాగ అంచనా వ్యయం భారీగా ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనికిగాను 114 కిలోల బంగారం వినియోగించాల్సి ఉంటుందని అంచనా వేశారు. గతంలో 40 కిలోల బంగారం పడుతుందని దేవదాయశాఖ స్థపతి అంచనా వేశారు. కాగా రత్నగిరివాసుడైన సత్యదేవుడిని ప్రధానాలయంలో భక్తులు దర్శించుకునే విధానం పాతవిధానంలో అమలుచేయాలని ఈవో రామచంద్రమోహన్ ఆదేశించారు. గతంలో ప్రధానలయంలోకి ఉత్తరదిక్కుకు ప్రవేశించి మూలవరులను దర్శించుకుని దక్షిణమార్గం ద్వారా వచ్చేవారు. పూర్వపు ఈవో ఆజాద్ ప్రదక్షిణ దర్శనం ప్రవేశపెట్టి రూ.300 టిక్కెట్టు నిర్ణయించారు. రద్దీ రోజుల్లో ఈ విధానం వల్ల భక్తులకు ఇబ్బంది కలిగి దర్శనం ఆలస్యం అవుతుండడంతో ఈవో పాత విధానం అమలుచేయాలని ఆదేశించారు.

కండివాగులో పడి మహిళ మృతి



కోటనందూరు, సెప్టెంబరు 10: కాకినాడ జిల్లా కోటనందూరు మండల కే.కోట్టాం గ్రామంలో కండువాడు ఉధృతికి మహిళ మృతి చెందింది. వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన కోటిమిల్లి తులుపులమ్మ రజకత్వం చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. రోజూలాగే కండువాగులో దుస్తులు ఉతికేందుకు దిగి బళ్ల వద్దకు వెళ్తుండగా వరదప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో కొట్టుకుపోయింది. స్థానికులు గుర్తించి మహిళను బయటకు తీసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ రామకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.

నేడు ఇంటర్ స్టేట్ బ్యాడ్మింటన్ ఫైనల్ పోటీలు

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు10: రాజమహేంద్రవరంలో జరుగుతున్న సౌత్‌జోన్ ఇంటర్‌స్టేట్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్ పోటీల ఫైనల్స్ బుధవారం జరుతాయని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం సెమీ ఫైనల్ మ్యాచ్‌లు, మధ్యాహ్నం ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. మంగళవారం మెన్స్ సింగిల్స్, ఉమెన్ సింగిల్స్, ఉమెన్ డబుల్స్ తదితర విభాగాల్లో పోటీలు జరిగాయి.





నిందితుల వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్.. (పక్కన) చోరీ సొత్తు

పగలు రెక్కీ చేసి.. రాత్రికి దోచేస్తారు!

- తాళాలు వేసి ఉన్న ఇళ్లలో దొంగతనాలు చేస్తున్న నలుగురు నిందితుల అరెస్టు
- రూ.94.70 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం
- తొలుత చిరువ్యాపారులు.. సులువుగా డబ్బుల కోసం దొంగతనాల్లోకి
- వివరాలు వెల్లడించిన కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

కాకినాడ క్రైం, సెప్టెంబరు 10: ఆ నలుగురు పగలు రెక్కీ చేశారంటే.. రాత్రికి ఆ ఇల్లు దోచుకుంటారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లలో రాత్రిపూట యథేచ్ఛగా దొంగతనాలకు పాల్పడుతూ జల్సాలు చేస్తున్న ముఠాను జిల్లా పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.94 లక్షల70వేల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఇటీవల కాలంలో కాకినాడ జిల్లా పరిసర ప్రాంతాల్లో రాత్రిపూట దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో నిఘాను పటిష్టం చేసి పెట్రోలింగ్‌ను ముమ్మరం చేశారు. ఈక్రమంలో సోమవారం రాత్రి క్రైం పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా కాకినాడ రూరల్ మండలం సర్పవరం భవనారాయణస్వామి గుడి సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ విచారణలో వారిని కాకినాడ డెయిరీఫారం సెంటర్ బాలవెంకట్‌నగర్‌కు చెందిన టేకుమూడి శ్రీకాంత్, సర్పవరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గైగోలుపాడు రాజేంద్రనగర్‌కు చెందిన పాత నేరస్తుడు వల్లి లక్ష్మణ్‌కుమార్, అతడి అన్నయ్య వల్లి రాంకుమార్, ధవళేశ్వరానికి చెందిన పాత నేరస్తుడు మెండి మహేశ్వరదుర్గాప్రసాద్‌గా గుర్తించారు. గతంలో వీరు చిరువ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగించేవారు. సులువుగా డబ్బులు సంపాదించాలనే దురుద్దేశంతో దొంగతనాలను ప్రవృత్తిగా మార్చుకున్నారు. ఈ క్రమంలో టేకుమూడి శ్రీకాంత్, వల్లి లక్ష్మణ్‌కుమార్ కలిసి కాకినాడ నగరం, ఇంద్రపాలెం, సామర్లకోట, తిమ్మాపురం, పెద్దాపురం తదితర ప్రాంతాల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లను పగటిపూట రెక్కీ నిర్వహించి రాత్రి సమయాల్లో ఇళ్లలోకి దూకి తలుపులు తాళాలు బద్దలకొట్టి దొంగతనాలను చేసేవారు. దొంగిలించిన సొత్తును లక్ష్మణ్‌కు అన్నయ్య అయిన రాంకుమార్ ద్వారా అతడి స్నేహితుడైన మెండి మహేశ్వరదుర్గాప్రసాద్‌ను సంప్రదించి.. అతడి ద్వారా గుర్తు తెలియని వ్యక్తులకు అమ్మి ఆ సొమ్మును జల్సా చేసేవారని ఎస్పీ వెల్లడించారు. శ్రీకాంత్, లక్ష్మణ్‌కుమార్ మొత్తంగా 21 ఇళ్లల్లో నేరాలకు పాల్పడి రూ.1కోటి44లక్షల 24వేల విలువైన చోరీసొత్తును కొల్లగొట్టి కొంత సొమ్ము జల్సా చేశారని తెలిపారు. నిందితుల నుంచి రూ.84 లక్షల విలువైన 1200 గ్రాముల బంగారు ఆభరణాలను, రూ.9.90 లక్షల విలువైన 11 కిలోల వెండి వస్తువులను, నేరాలకు వినియోగించేందుకు ఉపయోగించిన రూ.80 వేల విలువైన మోటారుసైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. నేరస్తులను చాకచక్యంగా పట్టుకోవడంలో విశేష కృషిచేసిన కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్ విష్ణు, ఎస్‌బీడీఎస్పీ సీహెచ్ శ్రీరామ కోటేశ్వరరావు, సర్పవరం సీఐ పెద్దిరాజు, క్రైం సీఐ వి.కృష్ణ, ఎస్ఐలు రామకృష్ణ, వినయ్‌ప్రతాప్, క్రైం ఏఎస్ఐ కొప్పిశెట్టి గోవిందరావు, హెచ్‌సీలు గొప్పు సత్తిబాబు, గొప్పు చిన్న, పీసీలు మౌళి, నాయుడు, స్వామిలను ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఎస్పీ ఎన్‌జేపీ భాస్కర్‌రావు, కాకినాడ ఎస్‌డీపీవో రఘువీర్‌విష్ణు, ఎస్‌బీడీఎస్పీ శ్రీరామకోటేశ్వరరావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అటు వరద గోదావరి ఇటు శబరి దూకుడు!

ఏజెన్సీ విలీన మండలాల్లో ముంచెత్తిన వరద.. నిలిచిపోయిన రాకపోకలు



చింతూరు మండలం చట్టి వద్ద ఏపీ - ఛత్తీస్‌గఢ్ 30వ నెంబరు జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు



చింతూరు మండలం ముకునూరు వద్ద సోకిలేరు వాగు దాటించి రోగిని ఆసుపత్రికి తరలిస్తున్న బాధితులు

చింతూరు, సెప్టెంబరు 10 : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలో వరద ఉధృతి కొనసాగుతోంది. శబరి, సీలేరు నదులతో పాటు సోకిలేరు, చంద్రవంక, చీకటివాగు, కుయుగూరు వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. మండలంలో 22 గ్రామాలకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. గంటగంటకు పెరుగుతున్న వరద లోతట్టు వాసులను ఆందోళనకు గురిచేస్తోంది. పోలవరం బ్యాక్ వాటర్ కారణంగానే తమకు ఏటా వరద సమస్య వస్తోందని బాధితులు వాపోతున్నారు. తమకు పరిహారం ఇచ్చి పునరావాస కేంద్రాలకు తరలించాలని వారంతా డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో చింతూరు ఒడ్డు వాసులు మంగళవారం వరద నీటిలో ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న ఐటీడీఏ పీవో అపూర్వభరత్ వారి వద్దకు వెళ్లి వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తామని వారికి హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. కాగా మంగళవారం పెద్దసీతనపల్లి, నర్సింగపేట తదితర ముంపు ప్రభావిత గ్రామాలకు చెందిన రోగులను ముకునూరు వద్ద నాటు పడవ దాటించి చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కల్లేరు ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థులను జాలర్ల పడవల ద్వారా దాటించి వారి వారి ఇళ్లకు చేర్చారు. చింతూరు వద్ద శబరి నీటిమట్టం 44 అడుగుల వద్ద భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 48 అడుగుల వద్ద ప్రవహిస్తుండడంతో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌ల నడుమ 326, 30వ నెంబరు జాతీయ రహదారులపై రాకపోకలు నిలిచిపోయి చట్టి వద్ద వాహనాలు నిలిచిపోయాయి.





భద్రాచలం-కూనవరం మధ్యలో రహదారిపై చేరిన వరదనీరు.. ఇంట్లో సామగ్రి పట్టుకుని పునరావాస కేంద్రాలకు వెళ్తున్న ప్రజలు

కూనవరంలో జలదిగ్బంధం.. రాకపోకలన్నీ బంద్

కూనవరం, సెప్టెంబరు 10: కూనవరం మండలంలోని వరద ప్రభావంతో అన్ని గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాచలం-కూనవరంకు పూర్తిగా సంబంధాలు తెగిపోగా, మండలంలోని అన్ని గ్రామాల రహదారులపై వరద వచ్చి చేరింది. ఇప్పటికే పాఠశాలలు మూతపడగా మూడు రోజుల నుంచి ఆర్టీసీ బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. ఈసారి వరదకు శబరి దూకుడు పెంచింది. కూనవరంలో శబరి గోదావరి సంగమం కావడంతో ఆ ప్రదేశం సముద్రంగా కనిపిస్తోంది. అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించేందుకు లాంచీలు సిద్ధం చేశారు. గిన్నెల బజార్, ఉదయభాస్కర్ కాలనీతోపాటు శబరికొత్తగూడెం తదితర గ్రామాల ప్రజలను పునరావాస కేంద్రాలకు వెళ్లాలని ప్రచారం నిర్వహించారు. శబరి గోదావరి సంగమం వద్ద ఉన్న శబరి బ్రిడ్జిని తాకి ఉధృతంగా ప్రవహిస్తోంది.

వీఆర్ పురం మండలంలో 30 గ్రామాలకు రాకపోకలు బంద్

వరరామచంద్రాపురం, సెప్టెంబరు 10: గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో వరరామచంద్రపురం మండలంలోని ప్రధాన రహదారులపై వరదనీరు చేరుకోవడంతో 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో శ్రీరామగిరి, సీతంపేట గ్రామాల మధ్య వరద నీరు రోడ్డుపై చేరుకుంది. శ్రీరామగిరి గ్రామంలో వరదనీరు ఇళ్లలోకి చేరుకోవడంతో గ్రామస్తులు గుట్టపై నిర్మించుకున్న పునరావాస కేంద్రాల్లోకి సామాన్లతో చేరుకుంటున్నారు. అటు వెంకంపాలెం, చింతరేవుపల్లి, తుష్టివారిగూడెం, వెంకన్నగూడెం, రామవరం, సోములగూడెం గ్రామాల మధ్యలోగల చింతూరు వెళ్లే ప్రధాన రహదారిపై వరదనీరు చేరుకుంది. వరదల నేపథ్యంలో ప్రభుత్వం అందించిన దోమతెరలు, కందిపప్పు, నూనెను తహశీల్దార్ సుబ్బారావు ఆధ్వర్యంలో జడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, ఎంపీపీ కారం లక్ష్మి బాధితులకు పంపిణీ చేశారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

రేపు కాకినాడలో జాబ్‌మేళా

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 10: ఐటీఐ ఫైనల్ పరీక్షలు రాసిన, పాసైన విద్యార్థులకు గురువారం కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు, ఐటీఐ ఫైనల్ పరీక్షలు రాసిన అన్ని ట్రేడ్‌ల వారికి 400 ఖాళీలను భర్తీ చేస్తారని బయోడేటాతో హాజరుకావాలని కన్వీనర్ ఎంవీజీ వర్మ పేర్కొన్నారు.

వరద ముప్పు లేకుండా చర్యలు చేపట్టాలి

అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే వనమాడి



విజయవాడలో మంత్రి నారాయణతో కలిసి పర్యటిస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

కాకినాడ సిటీ, సెప్టెంబరు 10: గాడేరు, బిక్కవోలు డ్రెయిన్లు, కాలువలకు వరద పోటెత్తిన నేపథ్యంలో కాకినాడ నగరానికి ఎటువంటి వరద ముప్పు లేకుండా చర్యలు చేపట్టాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆదేశించారు. విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మంగళవారం జిల్లా కలెక్టర్, అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. గాడేరు, బిక్కవోలు డ్రెయిన్లు, కాలువల నుంచి వచ్చే వరద నీరు వల్ల కాకినాడలోని 24,25,26,37,41,43 డివిజన్లకు ముంపు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల వరద ప్రభావం పడకుండా జలవనరులశాఖ, కార్పొరేషన్ అధికారులు సమన్వయం చేసుకుని అత్యవసర చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సామర్లకోట కెనాల్‌రోడ్డు, ప్రతాప్‌నగర్, వార్ఫ్‌రోడ్డు, పరదేశమ్మపేట, నరసింహరోడ్, రిక్షాలపేట, పద్మనాభనగర్ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. విజయవాడ వరద ప్రభావిత ప్రాంతం ముస్తఫా రోడ్డు, రాజీవ్‌నగర్‌లో మున్సిపల్ శాఖా మంత్రి నారాయణతో కలిసి సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పర్యటించారు. వరద బాధితులకు అందిస్తున్న ఆహార పంపిణీని పర్యవేక్షించారు.

పటిష్ట భద్రత నడుమ గణేష్ నిమజ్జనాలు



సూచనలు ఇస్తున్న మెరైన్ ఎస్పీ రవివర్మ

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 10: పటిష్టమైన బందోబస్తు నడుమ గణేష్ నిమజ్జనాలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోస్టల్ సెక్యూరిటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) రవివర్మ అధికారులను ఆదేశించారు. కాకినాడ జిల్లా మెరైన్ పోలీస్‌స్టేషన్ తనిఖీల్లో భాగంగా కాకినాడ సూర్యారావుపేట, వాకలపూడి బీచ్‌ను పరిశీలించారు. వినాయక చవితి నవరాత్రుల్లో భాగంగా నిమజ్జనం జరిగే 3పాయింట్ల వద్ద తగిన భద్రత బందోబస్తు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. భారీ వినాయక ప్రతిమల నిమజ్జం కోసం క్రేన్లు, విద్యుత్తు తదితర ఏర్పాట్లు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిమజ్జనం జరిగే సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచి సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. బీచ్‌లో జరిగే 3 నిమజ్జనం ప్రాంతాలను, మెరైన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో తీరప్రాంతంలో జరిగే బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. మెరైన్ సీఐ రామోహన్‌రెడ్డి, ఎస్ఐ ఎస్ఐ అప్పారెడ్డి,హెచ్‌సీలు పాల్గొన్నారు.

గొల్లప్రోలులో వరద బాధితుల ధర్నా

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 10: ఆహారం, నిత్యావసర సరుకులు, తాగునీరు అందించాలంటూ గొల్లప్రోలు తహశీల్దారు కార్యాలయం వద్ద అరుంధతీయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సభ్యులు, గొల్లప్రోలు పట్టణం అరుంధతీయపేట, ఎస్సీ కాలనీ వాసులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ప్రధాన రహదారిపై రాస్తారోకోకి దిగారు. తమకు న్యాయం చేయాలని, వరద ముంపునకు గురైనా తమను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని కాలనీలకు నిత్యావసర సరుకులు ఇచ్చి, ఆహారం సరఫరా చేస్తూ తమను పట్టించుకోకపోవడం ఏంటని ప్రశ్నించారు. తమకు తక్షణం నెలకు సరిపడా నిత్యావసర సరుకులు, ఆహారం అందించాలని డిమాండ్ చేశారు. తహశీల్దారు సత్యనారాయణతో చర్చలు జరపగా ఆందోళన విరమించారు.

కోటనందూరు మండల సర్వసభ్య సమావేశం

కోటనందూరు, సెప్టెంబరు 10: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ మండలంలోని 690 ఎకరాల్లో పంట నష్టం వచ్చిందన్నారు. ఎరువుల కొరత ఎక్కువగా ఉందని సభ్యులు అడుగుగా ఇబ్బందులు లేకుండా చుస్తామన్నారు. ఉపాధిహామి పథకంలో పనులు పారదర్శకంగా అమలు చేయాలని సర్పంచ్ బంటుపల్లి వెంకటేశ్వరరావు కోరారు. ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, అటవీ, ఉద్యానశాఖ తదితర అధికారులు డుమ్మా కొట్టారు. సమావేశంలో సమాధానాలు చేప్పేవారేలేక సభ్యులు మండిపడ్డారు. తహశీల్దార్ సుభాష్, ఎంపీడీవో సుబ్రహ్మణ్యశర్మ, ఎంపీపీ లగుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్‌లో భోజనాలు

జగ్గంపేట, సెప్టెంబరు 10: జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రతి మంగళవారం డొక్కా సీతమ్మ క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. మెయిన్‌రోడ్‌లో పాత పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన క్యాంటీన్‌లో మంగళవారం సుమారు 300 మందికి భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో జన సైనికులు మా దారపు వీరబాబు, బాలు సూరంపాలెం, సూరపరెడ్డి నరేష్, గోపిస్వామి, రేపూరి శ్రీను, పితాని వీరబాబు, రామకుర్తి బ్రహ్మజీ, గంధం శ్రీనివాస్, సురాబత్తుల వీరబాబు, రాజనాల శ్రీను, పోలిశెట్టి రాజన్న, ఇనగంటి ఓంకార్, అనసూయ దుర్గారావు పాల్గొన్నారు.

కాకినాడలో సీఐటీయూ ధర్నా

కాకినాడ సిటీ, సెప్టెంబరు 10: విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఈ మేరకు కాకినాడలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు. సంఘం జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబిరాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, కోశాధికారి మలకా రమణ మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం రూరల్ కన్వీనర్ టి.రాజా, మేడిశెట్టి వెంకట రమణ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ ఉన్నారు.

'వీధిలైట్లు వెలిగేలా చర్యలు చేపట్టాలి'

కాకినాడ సిటీ, సెప్టెంబరు 10: కాకినాడ డెయిరీఫారమ్ సెంటర్ నుంచి కుంభాభిషేకం రేవుకు వెళ్లే రోడ్డులో వీధిలైట్లు వెలగక రాత్రివేళల్లో ప్రమాదాలు జరుగుతున్నాయని, సత్వరం వీధిలైట్లు వెలిగేలా చర్యలు చేపట్టాలని 10వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జి చోడిపల్లి సతీష్ కోరారు. ఈ రోడ్డులో పరిస్థితిని వివరిస్తూ మంగళవారం అధికారులకు ఫొటోలతో సహా వినతిపత్రం సమర్పించారు. ఈ రోడ్డులో రాత్రి, పగలు తేడా లేకుండా గొడారిగుంట, కొత్తకాకినాడ, పర్లోవపేట, దుమ్ములపేట ప్రాంతాలకు చెందిన మత్స్యకారులు చేపల వేట నిమిత్తం నడుచుకుంటూ వెళ్తుంటారన్నారు. పోర్టుకు రాకపోకలు సాగించే మార్గం కావడంతో ద్విచక్ర వాహనాలు, లారీలు, భారీ వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందని అధికారులు వీధిలైట్లు వెలిగించాలని కోరారు.

ఆత్మహత్యల నివారణపై అవగాహన సదస్సు

గండేపల్లి, సెప్టెంబర్ 10: సూరంపాలెంలో ఆదిత్య యూనివర్సిటీ లియో క్లబ్, గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో జీవితం చాలా విలువైనది- ఆత్మహత్యల నివారణ చర్యలు అనే అంశంపై అవగాహన సదస్సు జరిగిందని డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. అంగలూరు ప్రభుత్వ డైట్ కాలేజీ సైకాలజీ విభాగం సీనియర్ లెక్చరర్ డాక్టర్ పి.వినయకుమార్ రిసోర్స్ పర్సన్‌గా ప్రసంగించారు. ఆదిత్య ఫార్మసీ కాలేజీలో ప్రపంచ ఆత్మహత్య నివారణ దినోత్సవం నిర్వహించారు. మెడికవర్ హాస్పిటల్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ గౌతమ్ రామ్ ముఖ్య అతిథిగా పాల్గొని ఆత్మహత్యల నివారణపై అవగాహన కల్పించారు.

లారీ కింద పడి వ్యక్తి

కాకినాడ క్రైం, సెప్టెంబరు 10: ప్రమాదవశాత్తూ లారీ కింద పడి ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మంగళవారం కాకినాడలో జరిగింది. కచ్చేరిపేటకు చెందిన బర్రి గంగాద్రి(52) మంగళవారం నడుచుకుంటూ వస్తూ జడ్పీ కూడలిలో రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో సామర్లకోట వైపు నుంచి వార్ఫ్‌రోడ్డు వైపు వెళ్తున్న రాజస్థాన్‌కు చెందిన లారీ అదుపు తప్పి లారీ టైర్ అతడి తలపై ఎక్కడంతో నుజ్జునుజ్జై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు అక్కడకి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'జీవో 115ని రద్దు చేయాలి'

జీజీహెచ్(కాకినాడ), సెప్టెంబరు 10: కాంట్రాక్ట్ స్టాఫ్‌నర్సులను వెంటనే రెగ్యులర్ చేసి జీవో నెం 115ని రద్దు చేయాలని ఏపీ నర్సస్ స్ట్రగుల్ కమిటీ కాకినాడ శాఖ జీజీహెచ్ ప్రాంగణంలో మంగళవారం ఆందోళన చేపట్టింది. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు చిన్నారి మాట్లాడుతూ వారం రోజుల కితం ప్రవేశపెట్టిన 115 జీవో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల భవిష్యత్తును అంధకారం చేయనుందని వాపోయారు. గురువారం వరకు విధులు నిర్వహిస్తూ ఆందోళన చేస్తామని, ఈనెల 13 నుంచి అత్యవసర సేవలు మినహాయించి విధులు బహిష్కరించి ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు.

ఏలేరుతో ఉక్కిరిబిక్కిరి!



ప్రత్తిపాడు: పెద్దిపాలెం-వేములపాలెం మార్గంలో వరద నీరు, సామర్లకోట ఏలేరు స్లూయిజ్ వద్ద ఏలేరు జలాలు, గొల్లప్రోలు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో వరద నీరు

ఏలేరు రిజర్వాయర్ నీటి విడుదలతో
గ్రామాల్లో వేలాది ఎకరాల పంట నీట మునక
ఏలేరు రిజర్వాయర్, ఏలేశ్వరం-అప్పనపాలెం
వంతెన పరిశీలించిన ఎమ్మెల్యే సత్యప్రభ

ఏలేశ్వరం, సెప్టెంబరు 10: ఎగువ ప్రాంతం నుంచి వచ్చే వరద నీటితో ఏలేరు రిజర్వాయర్ అధికారులను, ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేసింది. ప్రాజెక్టు నుంచి ఊహించనంత నీరు దిగువకు విడుదల చేయడంతో మండలంలోని యర్రవరం, తిరుమాలి గ్రామాల్లో వరద చేరగా మండలవ్యాప్తంగా 2,100 ఎకరాల పంట నీట మునిగింది. యర్రవరంలో మంగళవారం భారీగా వరద నీరు చేరడంతో స్థానిక ప్రజలను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కలిసి రొట్టెలు, తాగునీరు, భోజన సదుపాయాలు కల్పించారు. అనంతరం ఏలేరు రాజర్వాయర్‌ను సందర్శించి అధికారులతో మాట్లాడారు. ప్రాజెక్టులోని వివిధ గ్యాప్‌లను పరిశీలించారు. అనంతరం ఏలేశ్వరం-అప్పనపాలెం మధ్య ఏలురు ప్రధాన కాలువపై ఉన్న కుంగిన కాజ్‌వేను ఎమ్మెల్యే సత్యప్రభ మంగళవారం పరిశీలించారు. వరద ప్రవాహంతో గతంలో కంటే కాజ్‌వే పూర్తిగా ఒరిగిపోయి వంతెనపై నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో అప్పనపాలెం-జగ్గంపేట మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఎమ్మెల్యే సత్యప్రభ ప్రత్యేక చొరవ తీసుకుని ప్రజలు, విద్యార్థులు జగ్గంపేట మండలం మీదుగా ఏలేశ్వరం చేరుకునేలా ప్రత్యేక బస్సు సౌకర్యం కలించారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, జ్యోతుల పెదబాబు, కౌన్సిలర్లు బొదిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, అలమండ చలమయ్య పాల్గొన్నారు. మండలంలో నీట మునిగిన పంట పొలాలను ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి పరిశీలించారు. మండల వ్యాప్తంగా సుమారు 2100 ఎకరాలు పంట నీటమునిందని వ్యవసాయ అధికారిణి జ్యోతి తెలిపారు. తహశీల్దార్ వెంకటేశ్వరరావు, వ్యవసాయాధికారి విజయకుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల పరిశీలన

ప్రత్తిపాడు, సెప్టెంబరు 10: మండలంలోని పెద్దిపాలెం-వేములపాలెం గ్రామాల మధ్య సుబ్బారెడ్డి సాగర్ ఉధృతంగా ప్రవహించిన ఏటి కాలువ కొంత వరకు ఉధృతం తగ్గింది. ఈ మార్గాల్లో వాహన రాకపోకలు పునరుద్ధరణ కాలేదు. వేములపాలెం, గోకవరం, పి. జగన్నాధపురం గ్రామంలోని వంతెనలను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా పరిశీలించారు. గతంలో పి.జగన్నాధపురం, పెదశంకర్లపూడి, లంపకలోవ, ఉత్తరకంచిలలో సాగర్ సాగునీటి వ్యవస్థకు పడిన గండ్లు ప్రస్తుత వర్షాలకు మరింత పెద్దవిగా మారడంతో పూడ్చివేయాలని అధికారులకు సూచించారు. మండలంలో 1200 ఎకరాల పంట పొలాలు వరద ముంపునకు గురి కాక వ్యవసాయ శాఖ ఏడీ గంగాధర్ సిబ్బందితో పంట నష్ట నమోదు నిర్వహించారు.

తుని రూరల్: ఎమ్మెల్యే యనమల దివ్య తుని కొండవారిపేటలో ముంపు ప్రాంతాన్ని పరిశీలించి ముంపునకు గురవుతున్న ప్రాంతాల రక్షణకు శాశ్వత చర్యలు చేపట్టేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రెల్లి కాలనీలో పునరావాస కేంద్రాన్ని పరిశీలించి బాధితులతో మాట్లాడారు. బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఆమె వెంట మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఇనుగంటి సత్యనారాయణ, సిద్దాంతపు సత్తిబాబు, దంతులూరి శ్రీనివాసరాజు, అల్లు రాజు ఉన్నారు. తుని సబ్ డివిజన్ పరిధిలో తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి, మండలాల్లో పంపా రిజర్వాయర్‌తో పాటుగా ఏలేరు,తాండవ నదులు ఉగ్రరూపం దాల్చడంతో 3425 హెక్టార్లలో వరి, పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నట్టు అధికారులు అంచనా వేశారు.

'బాధితులను ఆదుకుంటాం'

పెద్దాపురం, సెప్టెంబరు 10: ఏలేరు వరద బాధితులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఏలేరు వరద ఉధృతి బారిన పడిన జి.రాగంపేట, వడ్లమూరు, కాండ్రకోట, మర్లావ తదితర గ్రామాల్లో ఆయన జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి, అధికారులతో కలసి పర్యటించారు. పంటలను పరిశీలించి రైతులు, నిరాశ్రయులను పరామర్శించారు. కాండ్రకోటలో దబ్బ కాలువపై ఉన్న తాత్కాలిక వంతెన వరద ఉధృతికి కొట్టుకుపోవడంతో దాని స్థానంలో ప్రస్తుతానికి మరో తాత్కాలిక మొబైల్ వంతెన నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. కూటమి నేతలు రాజాసూరిబాబు రాజు, విత్తనాల వెంకటరమణ, తహశీల్దార్ సీహెచ్ వెంకటలక్ష్మీ, ఇరిగేషన్ ఏఈ పాలెపు వీరబాబు, ఏవో కొమ్మోజు సంజయ్‌కుమార్ పాల్గొన్నారు. పెద్దాపురం డివిజన్ పరిధిలో ఏలేరు వరద ఉధృతి కారణంగా ఆరు గ్రామాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఆర్డీవో జె.సీతారామారావు తెలిపారు. మండల పరిధిలోని వరద ప్రభావిత గ్రామాలైన కాండ్రకోట, మర్లావలో ఆయన మంగళవారం పర్యటించారు.

సామర్లకోట: ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మండలంలో వెంకటకృష్ణరాయపురం గ్రామ ఏలేరు కాలువ గట్టు గండి ప్రమాద పరిస్థితిని జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, బీజేపీ ఇంచార్జి వెంకటరమణ, కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. అధికారులు తీసుకున్న చర్యలను సమీక్షించారు. అంతకుముందు గ్రామంలో ఏలేరు కాలువకు గండి పడే ప్రమాదపరిస్థితిని పరిశీలించారు. సామర్లకోట ఏలేరు కాలువ ద్వారా పిఠాపురం రోడ్డులో టిడ్కో గృహాల ప్లాట్‌లు సుమారు 4అడుగుల ఎత్తు వరద నీరు చేరడంతో 80 మంది బాధిత కుటుంబాలకు ప్రభుత్వ సత్వర సాయంగా 20 కిలోల బియ్యం తదితర నిత్యావసరాలను రాజప్ప, తుమ్మల పంపిణీ చేశారు.

కాలనీల్లోకి వరద నీరు

గొల్లప్రోలు/పిఠాపురం: గొల్లప్రోలులోని మార్కండేయపురం, రాయవరం రోడ్డు, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లోకి ఏలేరు వరద నీరు, పట్టణంలోని సూరంపేట, జగనన్న కాలనీ, ఎస్సీ కాలనీ, శివాలయమాన్యం తదితర కాలనీల్లోకి సుద్దగడ్డ వరద నీరు ప్రవేశించింది. పలుచోట్ల గృహాలు ముంపునకు గురయ్యాయి. ఇళ్ల చుట్టూ వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని వేరుశెనగమిల్లులు, ఇతర వాణిజ్య సముదాయాల్లోకి ఏలేరు వరద నీరు చేరింది. పిఠాపురం-గొల్లప్రోలు రోడ్డులో ప్రధాన రహదారి వెంబడి ఉన్న దాబాలు, హోటళ్లు, టీపాయింట్‌లు, ఇతర కిళ్లీ దుకాణాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. గొల్లప్రోలు శివారులో ఉన్న జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వరద ముంపులో చిక్కుకుంది. ఉదయం 10గంటల వరకూ వరద నీరు లేకపోవడంతో పాఠశాలను తెరవగా విద్యార్థులు వచ్చారు. తదనంతరం పాఠశాల ఆవరణలోకి వరద నీరు చేరడంతో ఉపాధ్యాయులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పాఠశాలకు సెలవు ప్రకటించి విద్యార్థులను పంపివేశారు. సాయంత్రానికి పాఠశాల పూర్తిగా ముంపులో చిక్కుకుంది.

ముంపులో పవన్ భూములు

పిఠాపురం: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్వంత ఇంటి నిర్మాణం కోసం కొనుగోలు చేసిన భూములు ఏలేరు వరద ముంపులో చిక్కుకున్నాయి. పిఠాపురం పట్టణ శివారులో 216 జాతీయరహదారికి సమీపంలో ఇల్లింద్రాడ, భోగాపురం గ్రామాల పరిధిలోకి వచ్చే 3.52 ఎకరాలను పవన్ కొనుగోలు చేశారు. ఏలేరు వరద ఉధృతికి ఆ పొలాలు ముంపునకు గురయ్యాయి. సుమారు 5 అడుగులకు పైగా ఎత్తులో వరద నీరు ప్రవహిస్తున్నది. దీంతో ఈయన ఇక్కడ ఇల్లు నిర్మించుకుంటారా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

ముంపులో గ్రామాలు

కిర్లంపూడి: ఏలేరు నుంచి నీరు విడుదల చేయడంతో మండలంలోని పలు గ్రామాలు ముంపుకు గురయ్యాయి. ప్రభుత్వాధికారులు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి బాధితులను ఆదుకుంటున్నారు. సుమారు 10వేల ఎకరాల్లో వరి పంట, పత్తి 50 ఎకరాల్లో, ఉద్యానవన పంటలు 400 ఎకరాల్లో పంటలు నీటమునిగినట్లు ఏవో జోకా అమృత తెలిపారు. వీరవరంలో కాలువకు 6 గండ్లు పడడంతో గ్రామమంతా జలమయమైంది. రాజుపాలెం ఎస్సీ కాలనీ ముంపుకు గురవడంతో పునరావాస కేంద్రాలకు చేరారు. భూపాలపట్నంలో సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు, ముక్కొల్లు సర్పంచ్ జ్యోతుల రాం బాబు, బస్వా వీరబాబు వరద బాధితులకు ఆహారాన్ని అందజేస్తున్నారు. ఎస్.తిమ్మాపురం, శృంగరాయునిపాలెం, పాలెం, గోనేడ గ్రామాల్లో జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పర్యటించారు. గోనేడలో బియ్యం మూటలు అందించారు.

మునిగిన వరి పొలాలు

జగ్గంపేటరూరల్: ఏలేరు వరద ఉధృతికి మండలంలోని రామవరం, జగ్గంపేట, కాట్రావులపల్లిలో వరి పొలాలు మునిగిపోయాయి. ఏలేరు కాలువ నుంచి వరద తిరిగి రామవరం కండి కాలువలోకి ఏలేరు జలాలు ప్రవేశించడంతో సుమారు 600 ఎకరాల పొలాలు మునిగాయి. ఏవో రెడ్ల శ్రీరామ్ పంట పొలాలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందించారు.

కొత్తపల్లి: ఏలేరు జలాలకు మండలంలో పలు గ్రామాల్లో సార్వా పంట నీట మునగడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుకపల్లి, నాగులాపల్లి, రమణక్కపేట, శ్రీరాంపురం, యండపల్లి గ్రామాల్లో 800 ఎకరాల్లో సార్వా వరి పంట నీట మునిగింది. మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందని, దీంతో పూర్తిగా పంటలు మునిగిపోయే ప్రమాదంఉందని ఆందోళనలో ఉన్నారు.



ఏలేశ్వరం: అప్పనపాలెం కాజ్‌వే వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ, పెద్దాపురం: వడ్లమూరులో వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజప్ప, కిర్లంపూడి: భూపాలపట్నంలో వరదనీరు, జగ్గంపేట మండలంలో పంట పొలాలు



గోకివాడ వద్ద వరద నీటితో ఏకమైన రోడ్డు, పొలాలు

గ్రామాల్లోకి ఏలేరు వరద నీరు

పిఠాపురం రూరల్, సెప్టెంబరు 10: మండలంలోని పలు గ్రామాల్లోకి ఏలేరు నీరు చేరింది. భోగాపురం ఎస్సీ కాలనీ, సగరపు పుంత తదితర ప్రాంతాలు, మాధవపురం, గోకివాడ గ్రామాల్లో పలువురు గృహాలు నీట మునిగాయి. కొన్ని ఇళ్లు పూర్తిగా వరద ముంపులో చిక్కుకున్నాయి. పిఠాపురం-గోకివాడ మధ్య గోకివాడకు సమీపంలో రహదారిపై ఏలేరు వరద నీరు 4 అడుగుల ఎత్తులో ప్రవహిస్తున్నది. ఇక్కడ రోడ్డు, పంటపొలాలు ఏకమయ్యాయి. దీంతో గోకివాడకు రాకపోకలు నిలిచిపోయాయి. గొల్లప్రోలు-బి.ప్రత్తిపాడు-భోగాపురం, పిఠాపురం-రాపర్తి రహదారిపై భారీగా వరద నీరు ప్రవహిస్తున్నది. వాహనాల రాకపోకలు నిలిపివేశారు. పిఠాపురం-జములపల్లి రోడ్డులో 120 ఏళ్ల నాటి రావిచెట్టు ఏలేరు వరద ఉధృతికి కూలిపోగా రాకపోకలు నిలిపివేశారు. పిఠాపురం రూరల్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

జలవనరుల శాఖ సీఈ పర్యటన

పిఠాపురం, సెప్టెంబరు 10: ఏలేరు వరదల కారణంగా గండ్లు పడిన ప్రాంతాలను జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ పుల్లారావు మంగళవారం పరిశీలించారు. పిఠాపురం, గొల్లప్రోలు మండలాల పరిధిలో 15గండ్లు పడ్డాయని అధికారులు వివరించారు. ఆయన వెంట ఇరిగేషన్ ఎస్ఈ శ్రీనివాసరావు, ఈఈ శేషగిరిరావు, ఏఈలు శ్రీనివాస్, పద్మజ, శివకృష్ణ తదితరులు ఉన్నారు.

'వ్యక్తిత్వ వికాసానికి భగవద్గీత తోడ్పాటు'

పోర్టుసిటీ (కాకినాడ), సెప్టెంబరు 10: అన్ని వయసుల వారికి వ్యక్తిత్వ వికాసానికి భగవద్గీత తోడ్పడుతుందని ప్రవచనకర్త మద్దాలి కెవివి.సత్యనారాయణమూర్తి అన్నారు. మంగళవారం శ్రీ వేణుగోపాల సంస్కృత ప్రచార సభ ఆధ్వర్యంలో గణపతి నవరాత్రులు పురస్కరించుకుని భగవద్గీత శ్లోకాలపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. సభకు వింజరపు జనార్దనం అధ్యక్షత వహించి మాట్లాడారు. కార్యక్రమంలో కాశీబొట్ల సత్యనారాయణ, దీక్షితుల సుబ్రహ్మణ్యం అద్దేపల్లి ఉదయ భాస్కరరావు, ప్రచార సభ ఉపాధ్యక్షులు సరిపల్లి శ్రీరామచంద్రమూర్తి, చింతపల్లి సుబ్బారావు పాల్గొన్నారు. గణపతి నవరాత్రుల్లో నగరంలోని దేవాదాయశాఖ ఉప కమిషనర్ కార్యాలయం ఆవరణలోని సంపత్ విజయ గణపతి స్వామి దేవాలయంలో పంచామృతాభిషేకాలు, బిల్వపత్రి పూజలు చేశారు. మెయిన్‌రోడ్డులోని విఘ్నేశ్వరాలయంలో పూజల్లో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల్లో అధికారుల పర్యటన



పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి

పిఠాపురం రూరల్/గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 10: గొల్లప్రోలు, పిఠాపురం మండలాల పరిధిలోని ముంపు ప్రాంతాల్లో జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్, కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్‌లు మంగళవారం పర్యటించారు. ముంపునకు గురైన పొలాలను పరిశీలించారు. వారి వెంట వ్యవసాయశాఖ ఏడీ పిస్వాతి, వ్యవసాయాధికారులు అచ్యుతరావు, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఏరువాక శాస్త్రవేత్త పరిశీలన

సామర్లకోట, సెప్టెంబరు 10: మండలంలోని పలు గ్రామాల్లో నీటముంపులో ఉన్న వరి పొలాలను ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ ఏ.సీతారామ శర్మ పరిశీలించారు. మండల వ్యవసాయాధికారిణి ఐ.సత్య ఏరువాక శాస్త్రవేత్త సీతారామశర్మ వెంట పాల్గొన్నారు. డాక్టర్ శర్మ రైతులతో మాట్లాడుతూ వరదనీటి ముంపు కారణంగా ఇంకా 3 రోజుల వరకూ ముంపు బెడద తొలగిపోదన్నారు. పొలం మడులలో నిల్వనీటిని బయటకు తరలించే మార్గాలుంటే ఆ నీటిని తీసివేయాలని సూచించారు. పంటలపై వ్యాధులు, చీడపీడలు వ్యాపించకుండా లీటరు నీటిలో ఒక గ్రాము కార్బండైజిమ్ లేదా 2 గ్రాముల కార్బండిజం, మ్యాంకోజెబ్‌తో కలిపి పంటలపై పిచికారీ చేయాలని సూచించారు. రైతులు పాల్గొన్నారు.



ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న వర్మ

వరద బాధితులకు అండగా ఉంటాం : వర్మ

పిఠాపురం, సెప్టెంబరు 10: ఏలేరు, సుద్దగడ్డ వరద ముంపు బాధితులకు అన్ని విధాల అండగా ఉంటామని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పిఠాపురం మండలం బిప్రత్తిపాడు, భోగాపురం, రాపర్తి, రాయవరం, కోలంక, గొల్లప్రోలు మండలంలోని పలు గ్రామాల్లో ఆయన మంగళవారం పర్యటించి ముంపు పొలాలను పరిశీలించారు. గొల్లప్రోలులో జగనన్న కాలనీ వాసులకు, సూరంపేట ప్రజలకు నిత్యావసర సరుకులు అందజేస్తున్నట్టు తెలిపారు. ఏలేరు, సుద్దగడ్డ ఆధునీకరణను కూటమి ప్రభుత్వం చేపడుతుందని, వరద ముంపు నుంచి శాశ్వతరక్షణ కల్పిస్తామని చెప్పారు. వరద ముంపు తగ్గగానే నష్టాలను అంచనా వేయడం జరుగుతుందని తెలిపారు. ఆయన వెంట టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లుమల్లు విజయకుమార్, నకుమళ్ల గంగాధర్, గుండ్ర సుబ్బారావు, వెన్నా గోపి, ఎలుబండి బాబులు ఉన్నారు.

కోన ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు

తొండంగి, సెప్టెంబరు 10: కోన ముంపు సమస్య శాశ్వత పరిష్కార దిశగా చర్యలు ప్రారంభమయ్యాయి. ఏటా వర్షాకాలంలో బీచ్ రోడ్ వెంబడి ఉన్నకోన గ్రామాలు ముంపుబారిన పడడం రివాజుగా మారింది. దీనికి శాశ్వత పరిష్కారం చూపేందుకు నివేదిక ఇవ్వాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అధికారులను ఆదేశించారు. దీంతో మంగళవారం తహశీల్దార్ మురార్జీ, టీడీపీ నేతలు యనమల రాజేష్, కొయ్యా రామకేశవ తదితరులు తీర ప్రాంతంలో పరిశీలన జరిపారు. ముంపునకు అడ్డంకిగా మారిన ఆక్రమణల తొలగించవలసి ఉంటుందని అధికారులకు తెలిపారు. దీనిపై ఆర్అండ్‌బీ అధికారులతో సమావేశమయ్యారు. బీచ్ రోడ్ మధ్య నుంచి ఇరువైపులా 33 అడుగుల మేర తొలగించ వలసి ఉంటుందని దానికి అనుగుణంగా మార్కింగ్ ఇచ్చారు. 8 మంది సర్వేయర్లతో కూడిన బృందం సర్వే జరిపి మార్కింగ్ వేశారు. తాత్కాలికంగా నీరు దిగువకు పోయే ఏర్పాట్లు చేస్తున్నారు. బీచ్ రోడ్‌కు ఇరువైపులా ఉన్న నీరు ఒకవైపు సముద్రంలోకి, మరోవైపు జమ్మేరులోకి పోయే ఏర్పాటు చేస్తున్నారు. ఆర్ఐ వెంకటేశ్వరావు, చొక్కా అప్పారావు, కాలిబోయిన చంద్రరావు, కొండబాబు కొయ్యా సూరిబాబు, రామకృష్ణ ఉన్నారు.



ఆక్రమణల తొలగింపునకు మార్కింగ్ వేస్తున్న అధికారులు



కాకినాడలో పరిశీలిస్తున్న కమిషనర్

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబర్ 10: వరదనీటి ఉధృతిని అంచనా వేస్తూ ఇంజనీరింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన సూచించారు. గాడేరు, బిక్కవోలు డ్రెయిన్లు, కాలువల్లో వరదనీరు పోటెత్తే సూచనలున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో వరదనీటి ప్రవాహాన్ని కమిషనర్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. సర్పవరం భావన్నారాయణ స్వామి గుడి వద్ద, జనచైతన్య నగర్ బ్రిడ్జి, ప్రతాప్‌నగర్ గాడేరు డ్రైన్ పాయింట్లతో పాటు తూర్పు ఏలేరు డ్రైన్ పరిశీలించారు.

వైద్యుల నిరసన

ప్రత్తిపాడు, సెప్టెంబరు 10: ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య సంఘాల వైద్యుల సంఘం ఆదేశాల మేరకు మంగళవారం ప్రత్తిపాడు మండలంలో వైద్యులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన వ్యక్తం చేశారు. వైద్యులు నష్టం చేకూర్చే విధంగా అకస్మాత్తుగా జీవోను మార్చడంపై ఆందోళన నిర్వహించారు. జీవో 85ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జగపతినగరంలో పారిశుధ్య పనులు

కిర్లంపూడి, సెప్టెంబరు 10: మండలంలోని జగపతినగరం గ్రామంలో సర్పంచ్ శ్రీలత మంగళవారం పారిశుధ్య పనులు వేగంగా చేపట్టారు. మురికినీరు పారకపోవడంతో పూడిక పనులు చేయించారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లుతూ వర్షాలకు ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని అప్పుడే అంటు రోగాలు వ్యాప్తి చెందకుండా ఉంటాయన్నారు. ఆమె వెంట గుడాల రాంబాబు,తూము కుమార్,కుర్ల చినబాబు ఉన్నారు.

నేడు భువనేశ్వరీ జయంతి ఉత్సవాలు

పెద్దాపురం, సెప్టెంబరు 10: స్థానిక వర్ధుల వారి వీధిలో వేంచేసి ఉన్న భువనేశ్వరీ అమ్మవారి జయంతి ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు భువనేశ్వరీ పీఠాధిపతి చింతా గోపీశర్మ తెలిపారు. అమ్మవారికి అత్యంత ప్రీతికరమైన భాద్రపద శుక్ల అష్టమి తిథిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామని, అధికంగా భక్తులు హాజరై అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించి కృపకు పాత్రులు కావాలని కోరారు.

భోజనం ప్యాకెట్లు అందజేత

ఏలేశ్వరం, సెప్టెంబరు 10: మనం ఫౌండేషన్ చైర్మన్ మానూరి లత ఆధ్వర్యంలో మంగళవారం ఏలేశ్వరం జాతీయ రహదారి పక్కన ఆకలితో అలమటిస్తున్న నిరుపేదలు, లారీ డ్రైవర్లకు, యాచకులకు పులిహోర, తాగునీరు, భోజనం ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో దనేకుల వీరబద్రరావు, వెలుగూరి హరేరామ్, యల్లపు విష్ణు, సూర్యనారాయణ, దిలీప్, వసంతరావు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.